నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, సోమవారం 14 అక్టోబర్ 2024 | KAMAREDDY

శోభాయమానం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉమ్మడి జిల్లాలో దుర్గామాత విగ్రహాలను ఆదివారం చెరువుల్లో నిమజ్జనం చేశారు. వివిధ మండపాల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో అమ్మవారి శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. భాజా భజంత్రీలు, భజనలు, యువకుల నృత్యాల మధ్య శోభాయాత్ర కొనసాగింది. అనంతరం స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు.

మోస్రాలో దుర్గామాత శోభాయాత్ర

నస్రుల్లాబాద్‌లో దుర్గామాత శోభాయాత్రలో కోలాటం ఆడుతున్న మహిళలు

అంబరాన్నంటిన దసరా సంబురాలు

ఉమ్మడి జిల్లాలో శనివారం విజయదశమి వేడుకలు అంబరాన్నంటాయి. ప్రజలు ఆనందోత్సాహాల మధ్య దసరా సంబురాలు జరుపుకొన్నారు. తొమ్మిది రోజులపాటు వివిధ అలంకారాలలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయదశమి రోజు శమీపూజ, ఆయుధ పూజ చేశారు. ఒకరికొకరు జమ్మీ ఆకు ఇచ్చిపుచ్చుకుంటూ దసరా శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పలు పట్టణాల్లో రావణ దహన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో ఇందూరు ఆర్య సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్రలో కర్ర సాము, కోలాటాలు ఆకట్టుకున్నాయి.

వేల్పూర్‌లో దసరా వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి వేముల
నాగిరెడ్డిపేట్ మండలం పోచారం గ్రామంలో జమ్మి కోసం పోటీ పడుతున్న గ్రామస్తులు
శక్కర్‌నగర్‌లోని రాంలీలా మైదానంలో రావణ దహనం
కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన ఆయుధ పూజలో పాల్గొన్న సీపీ, సిబ్బంది
బాన్సువాడలోని మినీ స్టేడియంలో నిర్వహించిన రావణ దహణ కార్యక్రమానికి హాజరైన పట్టణవాసులు

తనయులను కడతేర్చి..

తండ్రి బలవన్మరణం

- పండుగ పూట విషాదం
- ఇద్దరు చిన్నారులను బావిలోకి నెట్టి తండ్రి ఆత్మహత్య
- ముగ్గురు మృతితో గ్రామంలో విషాదఛాయలు
- తాడ్వాయి మండలం నందివాడలో ఘటన

ఘటనా స్థలం వద్ద మాజీ ఎమ్మెల్యే జాజాల, పోలీసులు, గ్రామస్తులు

శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

విఘ్నేశ్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి (ఫైల్)

లింగంపేట (తాడ్వాయి), అక్టోబర్13: అన్నదమ్ములైన ఆ చిన్నారులు కొత్త బట్టలు వేసుకొని దసరా పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. ఇంట్లో అందరితో సరదాగా గడుపుతుండగా.. అలా బయటికి వెళ్లొద్దామంటూ వారిని తండ్రి బైక్‌పై బయటికి తీసుకెళ్లాడు. ఇద్దరు చిన్నారులు నాన్న తమకు ఎక్కడికో తీసుకెళ్తున్నాడు అనుకొని ఆనందపడ్డారు. తండ్రి ఆ బైక్‌ను గ్రామశివారులోని ఓ వ్యవసాయబావి వద్దకు తీసుకెళ్లాడు. తన ఇద్దరు కుమారులను బావిలోకి నెట్టేసి తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తమకు ఏదైనా చూపిస్తాడనో, కొనిస్తాడనో ఆశతో వెంట వచ్చిన ఆ చిన్నారులకు కన్నతండ్రే కాలయముడవుతాడని ఊహించలేదు. పండుగ పూట తమ నూరేళ్ల ఆయుష్షును తనతో తీసుకెళ్తాడనుకోలేదు. ఈ హృదయవిషాదకర ఘటన కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం నందివాడ గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్నది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం..

నందివాడ గ్రామానికి చెందిన చిట్టెపు గుండారెడ్డి, సుగుణ దంపతులకు ఇద్దరు కూతుళ్లు. చిన్న కూతురు అపర్ణకు మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ధర్మాబాద్ మండలం నాయ్‌గావ్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డిని పదేండ్ల క్రితం ఇల్లరికం తెచ్చుకున్నారు. శ్రీనివాస్‌రెడ్డి వ్యవసాయ పనులు చేసేవాడు. అపర్ణ– శ్రీనివాస్‌రెడ్డి దంపతులకు ఇద్దరు కుమారులు విఘ్నేశ్‌రెడ్డి (7), అనిరుధ్ రెడ్డి (5) ఉన్నారు. శనివారం దసరా సంబురాల్లో పాల్గొన్న శ్రీనివాస్‌రెడ్డి.. రాత్రి 8 గంటల ప్రాంతంలో తన కుమారులను తీసుకొని బయటికి వెళ్లాడు. రాత్రి 10 దాటినా ఇంటికి రాకపోవడంతో భార్యతోపాటు కుటుంబీకులు వారి కోసం గాలించారు. ఆదివారం గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావి వద్ద శ్రీనివాస్‌రెడ్డికి సంబంధించిన సెల్‌ఫోన్, చెప్పులు గుర్తించారు. బావిలో చూడగా ఇద్దరు చిన్నారుల మృతదేహాలు కనిపించగా.. శ్రీనివాస్‌రెడ్డి ఆచూకీ లభ్యం కాలేదు. సమాచారం అందుకున్న ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు, కామారెడ్డి రూరల్ సీఐ రామన్, తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకొని చిన్నారుల మృతదేహాలను బయటికి తీయించారు. అనంతరం బావిలోని నీటిని మోటర్ సాయంతో తోడించగా శ్రీనివాస్‌రెడ్డి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ కలహాల కారణంగా తీవ్ర మనస్తాపంతో పిల్లలతో కలిసి బలవన్మరణానికి పాల్పడినట్లు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఘటనా స్థలానికి వెళ్లి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు పేర్కొన్నారు.

బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ మధుసూదనాచారి శాసనమండలి ప్రతిపక్ష నేతగా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.
– కామారెడ్డి, అక్టోబర్ 13

పోలీసుస్టేషన్ వద్ద భవానీ మాలధారుల ఆందోళన

బాన్సువాడ, అక్టోబర్ 13: బైక్ ఢీకొన్న ఘటనపై బాన్సువాడ పోలీసుస్టేషన్ ఎదుట భవానీమాలధారులు ఆదివారం ఆందోళన చేపట్టారు. నిజాంసాగర్ మండలంలోని గాలీపూర్ గ్రామానికి చెందిన భవానీమాలధారులు బాన్సువాడ నుంచి గాలీపూర్‌కు బైక్‌లపై బయల్దేరారు. మార్గమధ్యంలో జేకే తండాకు చెందిన ఓ వ్యక్తి బైక్‌ను స్వాముల ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. దీంతో సదరు వ్యక్తి, స్వాముల మధ్య మాటామాటపెరిగి తీవ్ర వాగ్వాదానికి దారితీసింది. ఈ క్రమంలో భవానీ మాలధారుడి మెడలో నుంచి మాల తెగిపోయింది. దీంతో మాలధారులందరూ బాన్సువాడ పోలీసుస్టేషన్‌కు తరలివచ్చి ఆందోళన చేపట్టారు. స్వాములతో ఘర్షణకు దిగిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న భవానీమాలధారులు

కోతులను తరుముతుండగా..

విద్యుదాఘాతంతో బాలుడు మృతి

రాజేశ్ (ఫైల్)

మాచారెడ్డి, అక్టోబర్ 13 : పంట పొలంలోకి వచ్చిన కోతులను తరుముతుండగా ప్రమాదశవాత్తు విద్యుత్ తీగ తగిలి ఓ బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం బండ రామేశ్వర్‌పల్లిలో శనివారం చోటుచేసుకున్నది. ఎస్సై అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. బండరామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన సినిగిరి రాజేశ్(16) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తమ పొలంలో కోతులు రాకుండా కావలి కోసం వెళ్లాడు. కోతులు రావడంతో వాటిని కర్రతో తరుముతుండగా పంట పొలంలో ఉన్న విద్యుత్ తీగ తగలడంతో షాక్ గురై అక్కడి క్కడే మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. రాజేశ్ తండ్రి లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా వైద్యశాలకు తరలించినట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి డిగ్రీ కళాశాలలు బంద్

ఖలీల్‌వాడి, అక్టోబర్ 13: రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయని కారణంగా సోమవారం నుంచి ప్రైవేట్ డిగ్రీ కళాశాలల బంద్ నిర్వహించనున్నట్లు ప్రైవేట్ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు అంబోజి ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత ఉన్న విద్యార్థులకు మూడేండ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడంలేదని పేర్కొన్నారు. దీంతో అధ్యాపకులు జీతాలు, అద్దె, విద్యుత్ బిల్లులు కట్టలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసేవరకు డిగ్రీ కళాశాలల బంద్ పాటిస్తామని తెలిపారు.